సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

గురువారం | 28 | మార్చి | 2024



టన్ను చీనీ రూ.26 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.26 వేలు, కనిష్టంగా 10 వేలు, సరాసరిన 17 వేల ప్రకారం పలికాయి.



కిలో టమాట రూ.13
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.13 పలికింది. మార్కెట్‌కు 170 టన్నుల సరుకు అమ్మకానికి వచ్చింది.

రంజాన్ వేళలు

గురువారం	శుక్రవారం
సాయంత్రం	ఉదయం
ఇఫ్తార్ : 6.35	సెహరీ : 5.03



న్యూస్‌రీల్

టీడీపీ ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథిపై కేసు
పెనుకొండ: హిందూపురం పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి బీకే పార్థసారథిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలతో కూడిన నివేదికను స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ అధికారులు కలెక్టరేట్‌కు పంపారు. బీకే పార్థసారథి ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి మంగళవారం తన స్వగృహంతో పాటు పార్టీ కార్యాలయంలో 300 నుంచి 400 మంది టీడీపీ కార్యకర్తలకు భోజన సౌకర్యం కల్పించారు. దీనిపై మంగళవారం రాత్రి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) అధికారి వంశీకృష్ణ భార్గవ్ ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



పుట్టపర్తి: జిల్లాలోని 10 మోడల్ స్కూళ్లలో 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ మీనాక్షి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు అర్హులని తెలిపారు. ఈ నెల 28వ తేదీ నుంచి మే 22వ తేదీ లోపు https:// apms. apcfss. in, www. cse. ap, gov. in వెబ్‌సైట్ల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయని, 10వ తరగతి మెరిట్, రిజర్వేషన్ ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ వర్గాల విద్యార్థులు రూ.150 చొప్పున ఫీజు చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు.

ప్రశాంతంగా ముగిసిన పదో తరగతి పరీక్షలు



కొత్తచెరువులో పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

పుట్టపర్తి: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ముగిశాయి. ఈనెల 18న పరీక్షలు ప్రారంభం కాగా, బుధవారం జరిగిన సోషల్‌తో ప్రధాన పరీక్షలు ముగిశాయి. ఈనెల 28, 30 తేదీల్లో మైనర్ సబ్జెక్టుల పరీక్షలుంటాయి. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 115 కేంద్రాల్లో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించామని, ఎక్కడా మాస్ కాపీయింగ్, పేపర్ లీక్‌కు ఘటనలకు తావులేకుండా విజయవంతంగా పరీక్షలు నిర్వహించినట్లు డీఈఓ మీనాక్షి తెలిపారు. రోజు 95.5 శాతం హాజరు నమోదైందని, మొత్తంగా 26 వేల మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాశారని తెలిపారు. పరీక్షల నిర్వహణలో 1,250 ఇన్విజిలేటర్లు విధులు నిర్వర్తించారని డీఈఓ వెల్లడించారు. ఇక చివరి రోజు బుధవారం జరిగిన సోషల్ పరీక్షకు 22,658 మంది విద్యార్థులకు గాను 21,822 మంది విద్యార్థులు హాజరయ్యారు. 836 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

విత్తన కష్టాలకు.. ఉన్న ఊరిలోనే చెక్





- బాబు జమానాలో అన్నదాతకు చెప్పనలవిగా విత్తన కష్టాలు
- నేడు గ్రామంలోనే ఆర్‌బీకేలో సాఫీగా విత్తనం

టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ప్రత్యామ్నాయ విత్తనం కోసం డీసీఎంఎస్ కార్యాలయం వద్ద ఎండలోనే బారులు తీరిన రైతులు వీరు. ఇదొక్క ఫొటో చాలు చంద్రబాబు హయాంలో అన్నదాతలు ఎన్ని కష్టాలు పడ్డారో చెప్పడానికి. అప్పట్లో విత్తనాలు కావాలంటే రోజుల తరబడి శ్రమించాల్సిన దుస్థితి. మండల, డివిజన్, జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేసే పంపిణీ కేంద్రాలకు రెండు మూడు రోజులు తిరిగితే కానీ విత్తనాలు దక్కేవి కాదు. అది కూడా ఇంటిల్లిపాదీ వెళ్లాల్సిన పరిస్థితి. కొందరు రైతులు రాత్రిళ్లు, తెల్లవారు జామునే పంపిణీ కేంద్రాలకు చేరుకుని క్యూలలో తమ వంతుగా చెప్పులు పెట్టి అక్కడే పడుకునే వారు కూడా. చార్జీలు, రవాణా, భోజన ఖర్చులు, ఇతరత్రా శ్రమ అంతాఇంతా కాదు. ఒక్కోసారి పోలీసులతో తన్నులు కూడా తినాల్సి వచ్చేది. నాడు విత్తనాల కోసం రైతుల చేసిన పోరాటం గురించి ఎంత చెప్పినా తక్కువే. ఇది గత ఏడాది గార్లదిన్నె మండలంలోని ఓ గ్రామంలో స్థానికంగా ఉండే రైతు భరోసా కేంద్రం వేదికగా రైతులకు విత్తన పంపిణీ చేస్తున్న దృశ్యం. 2019 మేలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సరిగ్గా ఏడాది పూర్తయిన సందర్భంగా 2020 మే 30న గ్రామ గ్రామాన అన్నదాతల కోసం రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బీకేలు) ఏర్పాటు చేశారు. రైతులు గ్రామం దాటి ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేకుండా ఆర్‌బీకేల్లోనే విత్తనం, ఎరువులు, ఇతరత్రా ఇన్‌పుట్స్ అందించేందుకు శ్రీకారం చుట్టారు. యంత్ర పరికరాలు కూడా ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచారు. దీంతో రైతుల ఖర్చులు, శ్రమ బాగా తగ్గిపోయాయి. అనుకున్నదే తడువుగా విత్తనం, ఎరువులు తీసుకుంటూ సాఫీగా సేద్యం పనులు చేసుకుంటున్నారు. ప్రభుత్వం రాయితీ కిందే కాకుండా నాన్‌సబ్సిడీ కింద కూడా విత్తనాలు ఇస్తున్నారు. నూతన వ్యవసాయ విప్లవానికి నాంది పలకడంతో రైతన్నలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

– అనంతపురం అగ్రికల్చర్

పారిశ్రామిక విప్లవం

- ఏపీఐఐసీకి భారీగా భూముల కేటాయింపు
- పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి ప్లాట్లుగా ఏర్పాటు
- అర్హులైన పారిశ్రామిక వేత్తలకు కేటాయింపు
- సేల్ డీడ్ విధానంతో ముందుకొస్తున్న ఔత్సాహికులు



కప్పలబండ వద్ద సిద్ధమైన సీఎన్‌జీ గ్యాస్ యూనిట్



ఎంఎస్‌ఎంఈ పార్కులో స్టీల్ పరిశ్రమ కోసం సిద్ధమవుతున్న భవనం

3257.73 జిల్లాలో ఏపీఐఐసీకి కేటాయించిన భూమి (ఎకరాల్లో)	**1138** యూనిట్ల కోసం సిద్ధమైన ప్లాట్లు
889 ఖాళీగా ఉన్న ప్లాట్లు	**249** పరిశ్రమల కోసం కేటాయించిన ప్లాట్లు

పుట్టపర్తి అర్బన్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి అడుగులు పడ్డాయి. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు భారీగా రాయితీలు ప్రకటించి నూతన పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. పరిశ్రమల స్థాపనకు సింగిల్ విండో విధానంలో అనుమతులు ఇచ్చారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూమిని సైతం పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి ఇస్తున్నారు. ఇందుకోసం ఏపీఐఐసీ (ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ)కు జిల్లాలో 3257.73 ఎకరాలు కేటాయించారు. ప్రభుత్వం ఇచ్చిన స్థలాన్ని పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టుగా అభివృద్ధి చేస్తున్న ఏపీఐఐసీ ప్లాట్లుగా మార్చి ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అందిస్తోంది. దీంతో జిల్లాలో ఇండస్ట్రియల్ పార్కులు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి భారీగా ముందుకు వస్తున్నారు.

పూర్తి స్థాయిలో సౌకర్యాలు..

గత ప్రభుత్వాల చర్యల వల్ల ఏపీఐఐసీ పూర్తిగా ఉనికి కోల్పోయింది. అరకొరగా భూమిని కేటాయించినా నిధులు కేటాయించకపోవడంతో భూముల అభివృద్ధికి అవకాశం లేకపోయింది. దీంతో జిల్లా కేంద్రంలో గతంలోనే ఏపీఐఐసీకి 100 ఎకరాలు కేటాయించినా అభివృద్ధి చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఇక్కడ పారిశ్రామికవాడ అభివృద్ధి కోసం సరఫరా చేసిన కంకర, ఇసుకను సైతం కొందరు రాత్రికి రాత్రే తరలించారు. అయినా అప్పటి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కానీ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే పారిశ్రామిక ప్రగతికి చర్యలు చేపట్టింది. ఏపీఐఐసీని బలోపేతం చేసింది. ఏకంగా 3257.73 ఎకరాలను అప్పగించింది. నిధులూ కేటాయించడంతో ఏపీఐఐసీ ఆ భూములను పూర్తిగా అభివృద్ధి చేసి ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అప్పగిస్తోంది. దీంతో పరిశ్రమల స్థాపన సులువుగా మారగా, స్థానిక యువతకు ఉపాధి దొరుకుతోంది.

2,257 ఎకరాల్లో ప్లాట్ల అభివృద్ధి..

ఏపీఐఐసీకి జిల్లాలోని గోళ్లాపురం, గుడిపల్లి, ఆర్.అనంతపురం, అమ్మవారిపల్లి, కప్పలబండ, కొటిపి, తదితర ప్రాంతాల్లో 3257.73 ఎకరాల భూమిని కేటాయించారు. ఇందులో గత ఐదేళ్లలో 2257.19 ఎకరాల్లో సుమారు 1,138 ప్లాట్లు అభివృద్ధి చేసి పరిశ్రమలకు కేటాయించడానికి సిద్ధం చేశారు. ఇందులో ఇప్పటికే 1074.21 ఎకరాల్లో 249 యూనిట్లకు ప్లాట్లు కేటాయించారు. తక్కిన 1182.8 ఎకరాల్లోని 889 ప్లాట్లు ఖాళీగా ఉన్నాయి. వీటినీ త్వరలోనే యూనిట్ల కోసం కేటాయిస్తామని ఏపీఐఐసీ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే పలు చోట్ల పరిశ్రమలు నెలకొల్పడానికి ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ముందుకు వస్తున్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో ఇండస్ట్రియల్ పాలసీ బాగుందని, సింగిల్ డెస్క్‌లో అనుమతులు, రాయితీలు అందే వీలుందంటున్నారు. అందువల్లే కర్ణాటక ప్రాంత పారిశ్రామిక వేత్తలు కూడా ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమల స్థాపనకు ముందుకు వస్తున్నారంటున్నారు.

సీఎం జగన్ చొరవతో పెరిగిన ఆసక్తి..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన అనంతరం సేల్ డీడ్ పాలసీని తీసుకొచ్చారు. గతంలో ఒక యూనిట్‌కు కేటాయించిన భూమిపై హక్కులు పొందాలంటే సవాలక్ష ఆంక్షలు ఉండేవి. యూనిట్ నెలకొల్పి పలువురికి ఉపాధి కల్పిస్తున్నా... కేటాయించిన భూమికి పూర్తి మొత్తం కట్టినా... సేల్ డీడ్ పాలసీ వర్తింపజేసే వారు కాదు. ప్రస్తుతం ఏపీఐఐసీ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన భూమిలో ఒక యూనిట్‌ను నెలకొల్పి ఉత్పత్తితో పాటు ఉపాధి కల్పించిన తర్వాత సదరు భూమి ధరలో 50 శాతం మొత్తాన్ని చెల్లించగానే ప్రభుత్వం అగ్రిమెంట్ చేసి ఇస్తుంది. ఎకరాలోపు విస్తీర్ణంలో యూనిట్ నెలకొల్పి పరిశ్రమల శాఖ నిబంధనలు, చెల్లింపులు రెండేళ్లలోపు పూర్తి చేయగానే సదరు భూమిపై సర్వ హక్కులు వస్తాయి. అనంతరం సదరు భూమిపై ఆ పరిశ్రమ యాజమాన్యానికి పూర్తి హక్కులు వస్తాయి. అదే ఒక ఎకరాపైగా విస్తీర్ణంలో యూనిట్ నెలకొల్పితే మూడేళ్లలోపు పూర్తి చేయగానే సదరు భూమిపై అగ్రిమెంట్ చేసి ఇచ్చి భూమిపై హక్కులు కల్పిస్తుంది. అనంతరం సదరు భూమిని విక్రయించుకోవడానికి ఎటువంటి ఇబ్బంది ఉండదు. ఈ పాలసీతో చాలా మంది పారిశ్రామిక వేత్తలు ముందుకు వస్తున్నారు.

పరిశ్రమలకు పూర్తి సహకారం



పరిశ్రమలు నెలకొల్పడానికి ముందుకు వచ్చే ఔత్సాహికులకు పూర్తిగా సహకారం అందిస్తున్నాం. ఏపీఐఐసీ ద్వారా భూమిని కేటాయించడంతో పాటు ప్రభుత్వం అందించే రాయితీలు, ప్రోత్సాహకాల గురించి తెలియజేస్తున్నాం. సేల్ డీడ్ పాలసీతో చాలా మంది పారిశ్రామిక వేత్తలు ముందుకు వస్తున్నారు. ఇండస్ట్రియల్ పార్కు, ఎంఎస్‌ఎంఈ యూనిట్ల ఏర్పాటుకు అనుకూలంగా జిల్లాలో 1,138 ప్లాట్లు అభివృద్ధి చేశాం.

– సోని, జోనల్ మేనేజర్, ఏపీఐఐసీ

సోషల్ మీడియాపై నిఘా

- ఎన్నికల నేపథ్యంలో సామాజిక మాధ్యమాలపై ఆంక్షలు
- ద్వేష పూరిత, అలజడులు సృష్టించే పోస్టింగ్‌లు పెట్టే వారిపై కేసులు
- వివాదాస్పద పోస్టులు ఫార్వర్డ్ చేసినా బాధ్యులే



హిందూపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ అన్ని చర్యలూ తీసుకొంటోంది. ఈ నేపథ్యంలోనే సామాజిక మాధ్యమాలపై నిఘా వేసింది. ఎవరైనా ద్వేషపూరిత, అసత్య పూరిత, సమాజంలో అలజడులు సృష్టించేలా పోస్టులు పెడితే చర్యలు తీసుకునేలా ఏర్పాట్లు చేసింది.

నిరంతర పర్యవేక్షణ

ఎన్నికల వేళ రాజకీయ నాయకులు సామాజిక మాధ్యమాల (వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్, ఇన్‌స్టాగాం) ద్వారా ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. దీంతో కొన్ని అరాచక శక్తులు విద్వేషాలు రాజేసి తమ స్వార్థానికి వాడుకునేందుకు పావులు కదుపుతుంటాయి. ఇలాంటి వాటిని కట్టడి చేసేందుకు ఎన్నికల కమిషన్ నడుం బిగించింది. సోషల్ మీడియాపై అన్ని శాఖల అధికారులు నిఘా ఉంచారు. ఫొటోల మార్ఫింగ్, అశ్లీల చిత్రాలు పంచుకోవడం, ఇతరుల మనోభావాలు దెబ్బతినేలా సందేశాలు పంపడం తదితర కార్యకలాపాలకు పాల్పడితే 'ఐటీ యాక్ట్ –2000' సెక్షన్ 67 కింద కేసు నమోదు చేస్తారు. నేరం రుజువైతే ఐదేళ్ల ఏళ్ల జైలు, రూ. 2 లక్షల జరిమానా విధిస్తారు. సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు, కామెంట్లు పెడితే సదరు గ్రూప్ అడ్మిన్ వెంటనే వాటిని డిలీట్ చేయాలి. లేదంటే గ్రూపు సభ్యుడితో పాటు అడ్మిన్ కూడా బాధ్యత వహించాల్సి వస్తుంది.

ఆధారాలతో ఫిర్యాదు చేస్తే కేసులే

సామాజిక మాధ్యమాల్లో ఎవరైనా వ్యక్తిగతంగా, పార్టీలపై, సంస్థలు, అధికార యంత్రాంగంపై అసత్య ఆరోపణలు చేయకూడదు. పోటీ చేసే అభ్యర్థులపై కార్టూన్లు, మీమ్స్, షార్ట్ వీడియోల ద్వారా అసత్య ప్రచారం చేసినట్లు ఆధారాలతో ఫిర్యాదు చేస్తే వెంటనే పోలీసులు, ఎన్నికల అధికారులు సంయుక్తంగా పరిశీలించి కేసులు నమోదు చేస్తారు. ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా ప్రచారం చేసినా ఐపీసీ 504, 505 సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తారు. సోషల్ మీడియాలో ఎన్నికల ప్రచార ప్రకటనలకు ముందు ఉన్నతాధికారుల నుంచి మీడియా వెరిఫికేషన్ అనుమతి తీసుకోవాలి.

48 గంటల ముందే ప్రచారం నిలిపివేయాలి

ఎన్నికల నిబంధనల మేరకు పోలింగ్‌కు 48 గంటల ముందే సోషల్ మీడియాలో ఎన్నికల ప్రచారాన్ని నిలిపివేయాలి. సామాజిక మాధ్యమాల్లో ఎన్నికల ప్రచారం చేస్తే ఆయా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు వెచ్చిస్తున్న ఖర్చు వివరాల నివేదికను ఎన్నికల సంఘానికి అందజేయాల్సి ఉంటుంది. సోషల్ మీడియాలో ప్రచారం కూడా పెయిడ్ న్యూస్ కిందే పరిగణిస్తారు. ఖర్చు అభ్యర్థుల ఖాతాల్లో లెక్కిస్తారు. సోషల్ మీడియా విషయంలో అడ్మిన్‌లు జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది.

ధర్మవరం బీజేపీ అభ్యర్థిగా సత్యకుమార్
సాక్షి, పుట్టపర్తి: పొత్తులో భాగంగా టీడీపీ, జనసేనలు ధర్మవరం అసెంబ్లీ సీటును బీజేపీకి కేటాయించాయి. దీంతో బీజేపీ అధిష్టానం ధర్మవరం సీటును వై.సత్యకుమార్‌కు ఖరారు చేసింది. అయితే ఇన్నాళ్లూ బీజేపీ తరఫున టికెట్ ఆశించిన వరదాపురం సూరి (గోనుగుంట్ల సూర్యనారాయణ) ఆశలపై అధిష్టానం నీళ్లు చల్లింది. మరోవైపు టీడీపీ తరఫున తానే పోటీ చేస్తానని.. టికెట్ రానిపక్షంలో రాజకీయ సన్యాసం చేస్తానన్న పరిటాల శ్రీరామ్ వ్యాఖ్యలకు విలువ లేకుండా పోయింది. ధర్మవరం సీటు కోసం ఇటు వరదాపురం సూరి, అటు పరిటాల శ్రీరామ్ పట్టుబట్టారు. ఇద్దరూ చంద్రబాబు తొత్తులే అని గ్రహించిన బీజేపీ అధిష్టానం..చివరకు వై.సత్యకుమార్‌ను అభ్యర్థిగా ఖరారు చేసింది. కూటమిలో భాగంగా బీజేపీ అభ్యర్థి వై.సత్యకుమార్‌కు అదే పార్టీలో ఉన్న వరదాపురం సూరి, టీడీపీ ఇన్‌చార్జ్‌గా ఉన్న పరిటాల శ్రీరామ్ ఏమేరకు సహకారం అందిస్తారనేది చర్చగా మారింది.

మోహినీరూపాయ.. ఖాద్రీశా



మోహినీ అవతారంలో శ్రీవారు

కదిరి: ఖాద్రీశుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజైన బుధవారం స్వామివారు మోహినీ రూపంలో దర్శనమిచ్చారు. వయ్యారాలు ఒలకబోసే సోయగాలతో, చంకన అమృత భాండాగారాన్ని పెట్టుకొని సుకుమార వేషంలో కనిపించిన వసంతవల్లభుడిని చూసి భక్తజనం తన్మయత్వం చెందారు. ధగధగా మెరిసే పట్టు చీరలో గుభాళించే కదిరి మల్లెల అలంకరణలో ఉన్న ఖాద్రీశున్ని చూసేందుకు రెండు కళ్లూ సరిపోలేదు. శ్రీవారికి అలంకరించిన కుచ్చుల వాలు జడ ఈ ఉత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పాల కడలిని మదించగా ఉద్భవించిన అమృతాన్ని సేవించడానికి దేవతాసురులు పోటీ పడగా, అమృతాన్ని పంచడానికి శ్రీమహావిష్ణువు మోహినీ అవతారమెత్తారని భక్తుల విశ్వాసం. మోహినీ అవతార సేవ ఉభయదారులుగా కోటా వెంకట సుబ్బయ్య శెట్టి కుటుంబ సభ్యులు వ్యవహరించారని ఆలయ సహాయ కమిషనర్ వి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. భక్తుల కోసం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

భక్తుల ఇంటి వద్దకే శ్రీవారు

తిరు వీధుల దర్శనానంతరం స్వామి వారు రాత్రంతా పట్టణంలోని ప్రతి వీధికి వెళ్లారు. ఆలయానికి రాలేకపోతున్న భక్తుల ఇళ్ల వద్దకే వెళ్లి దర్శనమిచ్చారు. గురువారం సాయంత్రం తిరిగి ఆలయం చేరుకోనున్న స్వామివారు తిరిగి ప్రజా గరుడ సేవతో భక్తులకు దర్శనమివ్వనున్నారు.



భక్తులతో కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం



భక్తులను ఆకట్టుకున్న ప్రత్యేక వాయిద్యాలు

అనుమతుల మేరకే రాజకీయ ప్రకటనలు

- పార్టీ కార్యాలయాల్లో ఒక బ్యానర్, ఒక జెండాకు మాత్రమే అనుమతి



సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ అభిషేక్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: రాజకీయ పార్టీల కార్యాలయాల్లో స్థానిక చట్టాలు, అనుమతుల మేరకు రాజకీయ ప్రకటనల హోర్డింగ్‌లు కొనసాగించవచ్చని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. బుధవారం ఆయన రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణ, ముందస్తు ఏర్పాట్లు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు తీరుపై సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, డీఆర్‌ఓ కొండయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ అరుణ్ బాబు జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనల మేరకు ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థలు, రాజకీయ పార్టీల ప్రకటనలు అనుమతించవద్దన్నారు. ప్రధాన రహదారుల పక్కన అన్ని పార్టీలకు సమాన ప్రాతిపదికన ప్రచార హోర్డింగ్‌లు కేటాయించాలన్నారు. నూతన హోర్డింగ్‌లకు అనుమతులు లేవన్నారు. ప్రైవేట్ భవనాలపై ఇప్పటికే ఉన్న హోర్డింగ్‌లు, కటౌట్ల భద్రత, నిర్మాణ స్థిరత్వాన్ని పరిశీలించాలన్నారు. ప్రైవేటు ప్రాంగణాల్లో సులువుగా తరలించగలిగే ఒక చిన్న బ్యానర్, ఒక జెండాను ఏర్పాటు చేసుకునేందుకు అనుమతించాలన్నారు. సీ–విజిల్ ద్వారా అందే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టంను పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఫారం–7, 8లను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేయాలని, ఎవరికి నిర్దేశించిన విధులను వారు సక్రమంగా నిర్వర్తించాలన్నారు. సమావేశంలో పుట్టపర్తి, ధర్మవరం, కదిరి, మడకశిర నియోజకవర్గాల ఎన్నికల అధికారులు భాగ్యరేఖ, వెంకటశివరామిరెడ్డి, సన్నీ వంశీకృష్ణ, గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పరీక్ష కేంద్రాల పరిశీలన


ఎమ్మార్సీలో సిబ్బందితో మాట్లాడుతున్న అధికారులు

లేపాక్షి: మండల కేంద్రంలోని నాలుగు పదో తరగతి పరీక్ష కేంద్రాలను బుధవారం ఉదయం రీజనల్ జాయింట్ డైరెక్టర్ రాఘవ రెడ్డి, డీఈఓ మీనాక్షి పరిశీలించారు. నాలుగు కేంద్రాల్లో 660 మంది విద్యార్థులకు గాను 628 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహిస్తున్న తీరును గమనించి అధికారులను అభినందించారు. కాగా, ఈ నెల 23న ఫిజిక్స్ పరీక్ష ముగిసిన అనంతరం గురుకుల పాఠశాలకు చెందిన ఓ విద్యార్థి ఐఎఫ్‌పీ ప్యానల్ ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సదరు విద్యార్థి తల్లిదండ్రులను పిలిపించి రూ.1.30లక్షలను ఆర్‌జేడీ, డీఈఓ రికవరీ చేయించారు. అనంతరం ఎమ్మార్సీని చేరుకుని పలు రికార్డులు పరిశీలించారు.

ముగిసిన తలనీలాల వేలం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో తలనీలాల ఆదాయ వనరుపై చేపట్టిన వేలం ప్రక్రియ బుధవారం ముగిసింది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకూ భక్తుల తలనీలాలు పోటు చేసుకునే అంశానికి అనుమతులు మంజూరు చేసేందుకు ఆలయ అధికారులు ఇప్పటికి నాలుగు సార్లు వేలం నిర్వహించారు. బుధవారం ఉదయం ఆలయ ముఖమంటపంలో ఈఓ భద్రాజీ, ఆలయ ధర్మకర్త సుగుణమ్మ సమక్షంలో అధికారులు వేలం ప్రక్రియ నిర్వహించారు. రూ.1,23,03,000కు వేలం పాడి శ్రీసత్యసాయి జిల్లా హిందూపురానికి చెందిన రాజు ఎంటర్‌ప్రైజెస్ వారు తలనీలాల సేకరణ హక్కు దక్కించుకున్నారు. అనంతరం స్టేషనరీ సరఫరాకు సంబంధించి టెండర్లను నిర్వహించారు.

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య


హిందూపురం అర్బన్: వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... అమడగూరు మండలం చిన్నగానిపల్లికి చెందిన సింధు (25)కు మూడేళ్ల క్రితం హిందూపురంలోని సూరప్పకుంట వద్ద నివాసముంటున్న రేణుకారాజ్‌తో వివాహమైంది. ఇప్పటి వరకూ వీరికి సంతానం కలుగలేదు. ఈ క్రమంలో అత్తారింటి వేధింపులు ఎక్కువయ్యాయి. అదనపు కట్నం తేవాలంటూ తరచూ అత్తింటి వారు వేధిస్తుండడంతో మనస్తాపం చెందిన సింధు బుధవారం విషపూరిత ద్రావకం తాగింది. విషయం తెలుసుకున్న చుట్టుపక్కల వారు వెంటనే ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతిచెందినట్లు నిర్ధారించారు. అదనపు కట్నం కోసం అత్తారింటి వేధింపులు తాళలేకనే తమ బిడ్డ ఆత్మహత్య చేసుకున్నట్లుగా సింధు తల్లి సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ రియాజ్ అహమ్మద్ తెలిపారు. ఆస్పత్రిలో సింధు మృతదేహాన్ని డీఎస్పీ కంజాక్షన్, తహసీల్దార్ శివప్రసాదరెడ్డి పరిశీలించారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు



తవ్వకాలు జరిపిన ప్రాంతం

సోమందేపల్లి: మండలంలోని నడింపల్లి సమీపంలో ఉన్న పురాతన ముత్రాయ ఆలయంలో గుప్త నిధుల కోసం దుండగులు తవ్వకాలు జరిపారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత జేసీబీ సాయంతో తవ్వకాలు జరిపినట్లుగా స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం సాయంత్రం అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఆలయ మంటపం బండలు పెకలించి పక్కకు పడేసినట్లుగా గుర్తించారు.

నాటి ఖాద్రి.. నేటి కదిరి



కదిరి: పూర్వం ఖాద్రిగా పిలుచుకునే ప్రాంతమే నేడు కదిరిగా మారింది. సంస్కృతంలో 'ఖా' అంటే విష్ణు పాదం అని అర్థం. అద్రి అంటే కొండ. ఈ రెండింటినీ కలిపి ఖాద్రి (విష్ణువు పాదం మోపిన కొండ)గా అప్పట్లో పిలిచేవారు. కాలక్రమేణా... ఖాద్రి కాస్త కదిరిగా మారిపోయింది. దేశంలోని అత్యధికంగా ప్రతిష్ఠిత ఆలయాలు ఉండగా.. మరికొన్ని స్వయంభువుగా వెలసినవి ఉన్నాయి. ఇందులో ఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం కూడా ఒకటి. ఆలయ చరిత్రను పరిశీలిస్తే.. పూర్వం హిరణ్యకశ్యపుడి సంహారం అనంతరం ఖాద్రీ ప్రాంతంలో సంచరిస్తున్న నారసింహుడి ఉగ్రరూపాన్ని శాంతింప చేయడానికి దేవతల అభ్యర్థన మేరకు ప్రహ్లాదుడు స్తుతిస్తాడు. దీంతో సంతుష్టుడైన నారసింహుడు ప్రహ్లాదుడిని దగ్గరకు తీసుకుని ఆశీర్వదిస్తాడు. ఈ ఘట్టాన్ని ఆవిష్కరిస్తున్నట్లుగా కదిరి ఆలయంలో ప్రహ్లాద సమేతంగా నారసింహుడు భక్తులకు దర్శనమిస్తున్నారు. క్రీ.శ. 10వ శతాబ్దంలో పట్నం పాలేగారు రంగనాయకులుకు స్వామి స్వప్నంలో కనిపించి ఆదేశించిన మేరకు ఖాద్రి వృక్షం కింద తవ్వకాలు చేపడతాడు. ఆ సమయంలో బయటపడిన ప్రహ్లాద సమేత నారసింహుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఆలయ నిర్మాణం పూర్తి చేశారు. అప్పటి నుంచి భక్తవరదాయుడిగా ఇక్కడి లక్ష్మీనారసింహస్వామి పూజలు అందుకుంటున్నారు.


ఆలయ నాలుగు గోపురాలు

సార్వత్రిక ఎన్నికలను సజావుగా నిర్వహిస్తాం


అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ధర్మవరం అర్బన్: సార్వత్రిక ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. బుధవారం సాయంత్రం ఆయన పట్టణంలోని మార్కెట్ యార్డులో ఉన్న ఈవీఎం గోడౌన్‌లను తనిఖీ చేశారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారుల మధ్య గోడౌన్‌ను తెరిపించి ఈవీఎం, బ్యాలెట్ పేపర్, కంట్రోల్ యూనిట్, ఈవీ ప్యాట్‌లను పరిశీలించారు. ఈవీఎంలు భద్రతపై తరచూ తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఏప్రిల్ 15వ తేదీ వరకు నూతన ఓటు నమోదుకు సమయం ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలన్నీ కల్పించామని, ఓటర్లకు అనుకూలంగా ఉండేవిధంగా చర్యలు చేపట్టామన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్, తహసీల్దార్ రమేష్, డీఎస్పీ శ్రీనివాసులు, టూటౌన్ సీఐ అశోక్‌కుమార్ పలువురు అధికారులు ఉన్నారు.

తొండపాడు హుండీ ఆదాయం రూ.15.72 లక్షలు

గుత్తి రూరల్: తొండపాడు గ్రామంలోని బొలికొండ రంగనాథస్వామి ఆలయంలో హుండీ లెక్కింపు ద్వారా రూ.15,72,883 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ రాణి తెలిపారు. బుధవారం ఆలయ ఆవరణలో దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో శాశ్వత హుండీలను లెక్కించారు. 2023 సెప్టెంబర్ 22 నుంచి బుధవారం వరకూ హుండీలలో భక్తులు వేసిన నగదును లెక్కించగా పై ఆదాయం లభించింది. గ్రూప్ టెంపుల్ అధికారి నాగేంద్రుడు, ఆలయ సిబ్బంది, గుంతకల్లు హనుమాన్ సేవాసమితి సభ్యులు, అర్చకులు రవికుమార్, చేతన్‌వర్మ, లిఖిల్‌వర్మ పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థిని బలవన్మరణం


మృతురాలు సుజన

బత్తలపల్లి: 'అమ్మా! నేను పరీక్ష బాగా రాశాను. కచ్చితంగా పాస్ అవుతా' అంటూ తల్లిదండ్రులతో సంతోషం పంచుకున్న విద్యార్థిని... సాయంత్రమే ఉరి వేసుకుని విగతజీవిగా మారింది. పోలీసులు తెలిపిన మేరకు... తాడిమర్రి మండలం పెద్దకోట్ల గ్రామానికి చెందిన తిరుపాలు, ప్రమీలమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. కొంత కాలంగా వీరు బత్తలపల్లిలోని వడ్డెర కాలనీలో నివాసముంటూ తమ పిల్లలను చదివించుకుంటున్నారు. దంపతులిద్దరూ ఆర్డీటీ ఆస్పత్రిలో పని చేస్తున్నారు. పదో తరగతి చదువుతున్న కుమార్తె సుజన (15) బుధవారం ఉదయం పరీక్ష రాసి సంతోషంగా ఇంటికి చేరుకుంది. పరీక్ష ఎలా రాశావంటూ తల్లిదండ్రులు అడిగినప్పుడు చాలా బాగా రాశానని, కచ్చితంగా తాను పాసవుతానంటూ తెలిపింది. మధ్యాహ్నం తల్లిదండ్రులతో పాటు అన్న, తమ్ముడితో కలసి భోజనం చేసింది. తర్వాత తల్లిదండ్రులు ఆర్డీటీ ఆస్పత్రికి పనికి వెళ్లారు. 6వ తరగతి చదువుతున్న తమ్ముడు మధ్యాహ్నం పూట బడికి వెళ్లాడు. బీఫార్మసీ చదువుతున్న అన్న సైతం పనిపై బయటకు వెళ్లాడు. ఆ సమయంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న సుజన ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సాయంత్రం అన్న, తమ్ముడు ఇంటికి చేరుకుని తలుపు తీయాలని పిలిచినా లోపలి నుంచి ఎలాంటి స్పందన రాలేదు. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు అక్కడకు చేరుకుని దీంతో చుట్టుపక్కల వారి సాయంతో తలుపులు బలవంతంగా తీసి లోపలకు ప్రవేశించారు. అప్పటికే ఉరికి విగతజీవిగా వేలాడుతున్న సుజనను చూసి బోరున విలపించారు. కొంత కాలంగా సుజన కడుపునొప్పితో బాధపడుతోందని, కడుపులో గడ్డ ఉండడం వల్ల ఈ సమస్య నెలకొందని తల్లిదండ్రులు తెలిపారు. నొప్పి తీవ్రత భరించలేకనే ఆమె ఆత్మహత్య చేసుకుని ఉంటుందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు

అంజలి మృతి కేసులో వీడిన మిస్టరీ

- ఆర్థిక పరిస్థితులను ఆసరాగా చేసుకుని మోసం
- బేల్దారులు దస్తగిరి, బాలుతోపాటు అంజలి భర్త రాజు అరెస్ట్
- వివరాలు వెల్లడించిన అనంతపురం డీఎస్పీ వీరరాఘవరెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ వీరరాఘవరెడ్డి

అనంతపురం: నగరంలో రెండు రోజుల క్రితం చోటు చేసుకున్న అంజలి మృతి వెనుక మిస్టరీని పోలీసులు ఛేదించారు. ఆర్థిక పరిస్థితులను ఆసరా చేసుకుని ఆమె జీవితంతో చెలగాటమాడి మృతికి కారణమైన ముగ్గురిని అరెస్ట్ చేశారు. పట్టుబడిన వారిలో ఇద్దరు బేల్దారులతో పాటు అంజలి భర్త కూడా ఉండడం గమనార్హం. బుధవారం అనంతపురం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను డీఎస్పీ వీరరాఘవరెడ్డి వెల్లడించారు. అనంతపురంలోని కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ విగ్రహం వద్ద సోమవారం ఉదయం అంజలి మృతదేహాన్ని స్థానికులు గుర్తించిన విషయం తెలిసిందే. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. అనారోగ్యంతో మృతి చెందినట్లుగా భావించి ఓ స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఆమె మృతదేహాన్ని ఖననం చేయించారు. అయితే అంజలి మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ కుటుంబసభ్యులు చేసిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసిన వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప ఆ దిశగా దర్యాప్తు వేగవంతం చేశారు.

అంజలి శరీరంపై గాయాలు

బుధవారం ఉదయం జేఎన్‌టీయూఏ రోడ్డులోని హిందూశ్మశాన వాటికకు పోలీసులు చేరుకుని ఖననం చేసిన అంజలి మృతదేహాన్ని వెలికి తీయించి అనంతపురం మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ డి.శివరామిరెడ్డి సమక్షంలో ఫోరెన్సిక్ ప్రొఫెసర్ డాక్టర్ శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో పోస్టుమార్టం చేయించారు. కీలక భాగాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. అయితే ఆమెది సహజ మరణం కాదని ప్రాథమికంగా వైద్యులు నిర్ధారించారు. అంజలి శరీరంపై గాయాలు ఉండడం, ఉదర భాగంలో తీవ్ర గాయాన్ని గుర్తించారు. కాగా, అంజలికి ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. వీరిని బాల సదనంలో చేర్పించారు. వీరిలో ఓ కుమారుడు దొంగతనాల కేసులో నిందితుడని తెలిసింది.

ఆటోలో పిలుచుకెళ్లిన బేల్దారులు

అంజలి మృతిపై విభిన్న కథనాలు వెలువడడంతో కేసు దర్యాప్తును అనంతపురం ఎస్పీ అన్బురాజన్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ వీరరాఘవరెడ్డి నేతృత్వంలో దర్యాప్తు చేపట్టిన సీఐ రెడ్డప్ప... ఐసీడీఎస్ అధికారులతో కలసి అంజలి అత్త తులసమ్మ, ఆమె ముగ్గురు పిల్లలను విచారించారు. ఈ నెల 23న ఉదయం అంజలిని ఆమె ఇంటి నుంచి బేల్దారులు బాలు, దస్తగిరి ఆటోలో పిలుచుకెళ్లారు. కొన్ని గంటల తర్వాత ఇంటి వద్ద వదిలారు. విషయం తెలుసుకున్న భర్త రాజు అదే రోజు రాత్రి ఆమెను నిలదీశాడు. ఎక్కడెక్కడో తిరుగుతూ పిల్లల బాగోగులు పట్టించుకోవడం లేదంటూ మండిపడ్డాడు. ఆ సమయంలో అంజలి అదే స్థాయిలో తిరగబడింది. మద్యానికి బానిసగా మారి ఇంటి గురించి ఏ మాత్రం పట్టించుకోకుండా తిరుగుతున్నావంటూ భర్తను నిలదీసింది. కూలీ డబ్బులు వస్తే కుటుంబ అవసరాలకు ఉపయోగపడుతుందనే బేల్దారులతో కలసి వెళ్లానంటూ సమాధానమిచ్చింది. ఆ సమయంలో ఆమెను భర్త చితకబాదాడు. కుటుంబసభ్యులు వాంగ్మూలం ఆధారంగా దస్తగిరి, బాలును పోలీసులు అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేశారు. అంజలి ఆర్థిక పరిస్థితులను ఆసరాగా చేసుకుని ఆమెను శారీరకంగా ఇద్దరూ లోబర్చుకున్నట్లుగా వెల్లడైంది. దీంతో ఇద్దరితో పాటు అంజలిని కొట్టి ఆమె మృతికి కారణమైన భర్త రాజును సైతం పోలీసులు అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు వేగవంతం చేసిన సిబ్బందిని ఎస్పీ అన్బురాజన్ అభినందించారు.

వివాహేతర సంబంధంతోనే హత్య

- అమర్నాథరెడ్డి హత్య కేసును ఛేదించిన పోలీసులు
- నలుగురు ముద్దాయిల అరెస్టు...రిమాండ్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ మాధవరెడ్డి


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి, సిబ్బంది

పుట్టపర్తి టౌన్: నల్లమాడ మండలం కుటాలపల్లి గ్రామంలో ఈనెల 24న జరిగిన దుద్దుకుంట అమర్నాథరెడ్డి (40) హత్య కేసును పోలీసులు ఛేదించారు. వివాహేతర సంబంధమే హత్యకు కారణమని తేల్చారు. ఇందులో ఎలాంటి రాజకీయ కోణం లేదని స్పష్టం చేశారు. నలుగురు ముద్దాయిలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు బుధవారం ఎస్పీ మాధవరెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో వివరాలు వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల మేరకు...నల్లమాడ మండలం కుటాలపల్లికి చెందిన దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి గత 15 సంవత్సరాలుగా కుటాలపల్లి తండాకు చెందిన రామావత్ తిప్పేబాయితో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆమె బాగోగులన్నీ అతనే చూసుకొనేవాడు. అయితే మూడు నెలలుగా తిప్పేబాయి అదే గ్రామానికి చెందిన దుద్దుకుంట అమర్నాథరెడ్డితో సన్నిహితంగా ఉంటోంది. దీన్ని జీర్ణించుకోలేని శ్రీనివాసరెడ్డి ఆమెను నిలదీశాడు. దీంతో తిప్పేబాయి తాను అమర్నాథరెడ్డి వద్ద రూ.లక్ష తీసుకున్నానని, అందువల్లే అతనితో ఉండాల్సి వస్తోందని తెలిపింది. రూ.లక్ష తిరిగి ఇచ్చేస్తే మనం సంతోషంగా ఉండవచ్చని శ్రీనివాసరెడ్డితో చెప్పగా, తనవద్ద అంత డబ్బులేదని చెప్పాడు. అయితే తాను అమర్నాథరెడ్డితో సన్నిహితంగా మెలగడం తప్పదని ఆమె తేల్చిచెప్పింది. దీంతో దుద్దుకుంట అమర్నాథరెడ్డిని అడ్డుతొలగించుకోవాలని భావించిన శ్రీనివాసరెడ్డి తన అనుచరులు గంద్రు వీరారెడ్డి, చవటకుంటపల్లి గ్రామానికి చెందిన మల్లెల వినోద్‌కుమార్‌తో కలిసి అమర్నాథరెడ్డి హత్యకు ప్లాన్ వేశాడు. ఇందుకు రామావత్ తిప్పేబాయి కూడా సహకరించింది. ఈ క్రమంలోనే ఈ నెల 24 తేదీ రాత్రి 11 గంటల సమయంలో ముద్దాయిలంతా మద్యం సేవించి మోటర్ బైక్ (ఏపీ 02ఏవై 3992)పై అమర్నాథరెడ్డి పొలం వద్దకు వెళ్లారు. అప్పటికే అక్కడ నిద్రిస్తున్న అమర్నాథరెడ్డిని రేషం ఆకును కత్తిరించే కొడవలితో దారుణంగా నరికి చంపారు. ముద్దాయిలు దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి ఇప్పటికే ఒక కేసులో, మల్లెల వినోద్ కుమార్ ఆరు కేసుల్లో నిందితులుగా ఉన్నారు.

వేగంగా స్పందించిన పోలీసులు

అమర్నాథరెడ్డి హత్య జరిగిన విషయం తెలుసుకున్న ఎస్పీ మాధవరెడ్డి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు త్వరగా ఛేదించాలని సిబ్బందిని ఆదేశించారు. దీంతో డీఎస్పీ వాసుదేవన్ సూచనలు మేరకు నల్లమాడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రనాథ్ యాదవ్ తన సిబ్బందితో దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలోనే ఈనెల 27న (బుధవారం) నలుగురు ముద్దాయిలు నల్లమాడలో ఉన్నట్లు తెలుసుకుని వెళ్లి అరెస్ట్ చేశారు. వారి నుంచి హత్యకు ఉపయోగించిన కొడవలి, మోటర్‌బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ముద్దాయిలను కోర్టులో ప్రవేశపెట్టి జడ్జి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. హత్య జరిగిన రెండు రోజుల్లో కేసు ఛేదించిన డీఎస్పీ వాసుదేవన్, పుట్టపర్తి రూరల్ సీఐ రామయ్య, నల్లమాడ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్, సీఐ హేమంత్‌కుమార్, ఎస్ఐ రమేష్‌బాబు, సిబ్బందిని ఎస్పీ మాధవరెడ్డి ప్రత్యేకంగా ప్రశంసించారు.

రాజకీయం కోణం లేదు

అమర్నాథరెడ్డి హత్య కేసులో ఎలాంటి రాజకీయ కోణం లేదని ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. కావాలనే కొంతమంది స్థానిక నాయకులు దీన్ని రాజకీయం చేయాలని చూశారన్నారు. హత్య కేసులోని ముద్దాయిల్లో ఇద్దరు గతంలోనే కొన్ని కేసుల్లో నిందితులుగా ఉన్నారని తెలిపారు. వారిపై రౌడీ షీట్ తెరిశామని, పీడీ యాక్ట్ కూడా ప్రయోగిస్తామని ఎస్పీ వెల్లడించారు.

పోకిరీల ఘర్షణ


ఘర్షణ పడుతున్న యువకులు

సోమందేపల్లి: మండల కేంద్రంలో పోకిరీల ఆగడాలు నానాటికీ తీవ్రమవుతున్నాయి. ఇటీవల పదో తరగతి పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థినుల దృష్టిని ఆకర్షించేందుకు బైక్ వీలింగ్ చేస్తూ కొందరు యువకులు హల్‌చల్ చేశారు. బుధవారం సైతం పరీక్ష ముగిసిన తర్వాత ఇంటికి వెళుతున్న ఓ విద్యార్థినిని ఓ పోకిరీ వెకిలి చేష్టలతో పలకరించాడు. అప్పటికే ఆమె పట్ల ఇష్టం పెంచుకున్న మరో పోకిరీ ఈ విషయాన్ని తన స్నేహితులకు తెలిపి వారి సాయంతో ఎన్‌టీఆర్ సర్కిల్ వద్ద బాహాబాహీకి దిగారు. రెండు వర్గాలుగా విడిపోయి దాడులు చేసుకుంటున్న విషయాన్ని గమనించిన స్థానికులు కొందరు విడిపించేందుకు ప్రయత్నిస్తే వారిపైనే తిరగబడ్డారు. ఈ క్రమంలో మీడియా ఫొటోలు తీస్తుండగా గమనించి పరుగు తీశారు. కాగా, నాలుగు రోజుల క్రితం నక్కలగుట్ట వద్ద మతి స్థిమితం లేని మహిళను నలుగురు యువకులు లైంగికంగా వేధించినట్లు కాలనీ వాసులు చెబుతున్నారు. పోకిరీల ఆగడాలకు ఇప్పటికైనా పోలీసులు చెక్ పెట్టాలని ఈ సందర్భంగా పలువురు కోరారు.

పిల్లలకు విషమిచ్చి తల్లి ఆత్మహత్యాయత్నం

చిలమత్తూరు: కుటుంబ కలహాల నేపథ్యంలో పిల్లలకు విషమిచ్చి తల్లి ఆత్మహత్యాయత్నం చేసింది. గ్రామస్తులు తెలిపిన మేరకు... చిలమత్తూరు మండలం మరువకొత్తపల్లి బీసీ కాలనీకి చెందిన అనితకు ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. భర్త గోపాల్ మద్యానికి బానిసగా మారి జులాయిగా తిరుగుతుండడంతో కుటుంబ పోషణ భారమైంది. పలుమార్లు భర్తను ప్రాధేయపడినా తాగుడు మానేయకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆమె బుధవారం తన పిల్లలకు విషమిచ్చి, తానూ ఆత్మహత్యాయత్నం చేసింది. సకాలంలో ఈ విషయాన్ని గుర్తించిన చుట్టుపక్కల వారు వెంటనే వారిని కర్ణాటకలోని బాగేపల్లి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం చిక్కబళ్లాపురానికి తరలించారు. పిల్లల పరిస్థితి మెరుగ్గా ఉన్నట్లు సమాచారం. పరిస్థితి విషమంగా ఉన్న అనితను ఐసీయూలో ఉంచి వైద్యులు చికిత్స అందజేస్తున్నారు.

గరుడ వాహనంపై శ్రీవారు



రొళ్ల: మండల కేంద్రంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి దేవేరులతో కలసి గరుడ వాహనంపై శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయాన్నే మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు, అలంకరణల చేశారు. అనంతరం గరుడ వాహనంపై లక్ష్మీనరసింహాస్వామి ఉత్సవ మూర్తులను అధిష్ఠింపజేసి గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి పూల పల్లకీ ఉత్సవం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పీహెచ్‌సీ పరిశీలన


ఆస్పత్రి పరిసరాలను పరిశీలిస్తున్న డాక్టర్ కృష్ణారెడ్డి

సోమందేపల్లి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ను డీఎంహెచ్‌ఓ డాక్టర్ కృష్ణారెడ్డి బుధవారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. 24 గంటల పాటు ఆస్పత్రిలో వైద్య సేవలు అందిస్తున్న తరుణంలో సిబ్బంది పనితీరును పరిశీలించారు. రాత్రి వేళల్లో విధుల్లో ఉన్న మహిళ సిబ్బంది రక్షణకు తీసుకున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. నిర్లక్ష్యంగా విధులు నిర్వర్తిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఓంకార్ తదితరులు ఉన్నారు.

ఓటరు కార్డు లేకున్నా ఓటు వేయొచ్చు



హిందూపురం అర్బన్: భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఓటర్లు ఏ గుర్తింపు కార్డునైనా చూపి ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. ఆయా పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఓటరుగా నమోదైన వారు ఎలక్ట్రోరల్ గుర్తింపు కార్డు, బ్యాంక్ పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, ఉపాధిహామీ జాబ్‌కార్డు, పాన్ కార్డు, ఈఎస్‌ఐ స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్‌లో ఏదో ఒకటి చూపి ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. ఇండియన్ పాస్‌పోర్ట్, ఫొటోతో కూడిన పెన్షన్ పత్రం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు జారీ చేసిన గుర్తింపు కార్డు, సోషియల్ జస్టిస్, ఎంపవర్‌మెంట్ శాఖ జారీ చేసే యూనిక్ కార్డు, దివ్యాంగుల కార్డులు కూడా దోహదపడతాయి.